# నిజం నిద్రపోతుంటే...

- వారణాసి రామకృష్ణ



భరత్ పొలిటికల్ సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్నాడు. ప్రతిరోజూ అన్ని దినపత్రికలు చదువుతాడు. అన్ని టీవీ ఛానెల్స్‌లో వచ్చే న్యూస్ బులెటిన్లు శ్రద్ధగా చూస్తాడు.

చదివేసిన పేపర్ల దొంతిని విసుగ్గా ప్రక్కకి నెట్టి టీవీ ఆన్ చేశాడు.

'నమస్కారం! వార్తల్లోని ముఖ్యాంశాలు- ముషారఫ్ పార్లమెంటుపై దాడిని ఖండించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామని ముషారఫ్ ప్రకటించారు. ముషారఫ్ సైనిక బలగాలనుద్దేశించి మాట్లాడుతూ... ముషారఫ్ నేడు... ముషారఫ్!'

భరత్‌కి వొళ్లు మండుకొచ్చి ఛానెల్ మార్చాడు.

'ముషారఫ్ టోనీ బ్లెయిర్‌తో చర్చిస్తూ... నేడే పావెల్ ముషారఫ్‌ని కలిసి...'

కుతకుతలాడుతూ భరత్ మరో ఛానెల్ పెట్టాడు.

'ముషారఫ్ భారత పర్యటన తర్వాత కాశ్మీరు పరిస్థితి... ముషారఫ్-'

భరత్ కోపంగా రిమోట్‌ని వేలితో నొక్కాడు.

'...ముషారఫ్ నిర్యుద్ధ సంధి కుదుర్చుకోవాలని దక్షిణాసియాని అణ్వస్త్ర రహిత ప్రాంతంగా ఏర్పాటు చేయాలని చెప్పారు. ముషారఫ్... భారత ప్రధాని మాట్లాడుతూ ముషారఫ్-'

భరత్ ఆవేశంతో టీవీ ఆఫ్ చేసి రేడియో పెట్టాడు.

'ఆకాశవాణి! వార్తలు చదువుతున్నది ముషారాణి! క్షమించాలి ఉషారాణి! ఈ రోజు ముషారఫ్... కార్యక్రమంలో పాల్గొని... మాట్లాడుతూ ఉషారఫ్... క్షమించాలి... ముషారఫ్ శక్తిమంతమైన చర్యలు తీసుకున్నారని అమెరికా అధ్యక్షుడు ఒక ప్రకటనలో ముషారఫ్‌ని ప్రశంసించారు. ఆఫ్ఘన్ దాడుల తర్వాత ముషారఫ్... ఉష్! బుష్.. ముష్... ముషారఫ్... ష్! ష్! ష్ష్!! క్షమించాలి... విద్యుత్ సరఫరాలో అంతరాయం.. బుష్! ముష్! ముషారఫ్! ఫ్! ఫ్ఫ్!! ముషారఫ్!!...'

భరత్ ఉడికిపోతూ బలంగా రేడియో బద్దలుకొట్టాడు.

✦✧✦

ప్రాజెక్టు వర్కు కోసం భరత్ మారుమూల గ్రామం చేరి టేప్‌రికార్డర్ ఆన్ చేసి పొలంలో పని చేసుకుంటున్న ఓ రైతుతో-

'ఏమయ్యా! నీ పేరేంటి?' అని ప్రశ్నించగానే అతను గతుక్కుమని

'ముషారఫ్' గట్టిగా అరిచాడు.

ఈసారి భరత్ గతుక్కుమని భయంగా...

'ఏంటీ! నీ పేరు ముషారఫా?' అన్నాడు.

ఆ రైతు తల గోక్కుని 'వో. సారయ్య సార్!' చెప్పాడు.

'మరి ముషారఫ్ అన్నావేంటి?' చిరాగ్గా అడిగాడు.

'ఏమో సార్! ముషారఫ్ అని ఎందుకరిచానో నాకే అర్థం కావట్లేదు!'

'నరే నరే! ఎన్నికలొస్తున్నాయి కదా- ఓటు ఎవరికేస్తున్నావు?'

'ముషారఫ్‌కే సార్!'

'ఏంటీ! ముషారఫ్‌కా?'

'అవున్సార్! ఆయన బెమ్మాండంగా పరిపాలిస్తుండు గదా సార్!'

ఆ దెబ్బకి భరత్ అక్కడ్నించి పరుగు పరుగున మరో ఊరు చేరి

'ఏమయ్యా! మీ ఊళ్లో ఎలక్షన్ వాతావరణం...' చెప్పేలోగానే అతను 'భలే మంచిగుంది సారూ!' మీసాలు మెలేసి చెప్పాడు.

'ఇంతకీ నీ ఓటు?'

'ఇంకెవుర్కి? ముసారపుకే!'

నెత్తిన పిడుగు పడ్డట్టు భరత్ మొహం వేలాడేసి 'ఏమిటీ! ముసారపుకా!' అన్నాడు.

'అవ్‌మల్ల! గా సారు చానా మంచోడు సారూ! దినదినాము టీవీలల్ల రేడియలల్ల యే దిక్కుల సూసినా ఆయనే గద సారూ!' చెబుతుండగానే మా లావుపాటి మహిళ దూసుకొచ్చి-

'అస్సల్ ఇసియం జెప్పరాదే! ముసారపు 'ఆగరా' ఎల్లిందు! డిల్లీ సూసిందు! గల్లీ గల్లీ తిర్గిందు! యాది మర్సిపోకుంట పెతి జాగాకి పెండ్లాంని తోలుకుపోయిండు! మంచిగ 'తాజమాలు' గిట్ల సూపిచ్చిందు! పెండ్లాం గురించి గంత పట్టించుకున్నోడు- మా ఆడాల్ల వోట్లన్నీ ముసారపుకే సారూ-

భరత్‌కి పిచ్చెక్కి హైద్రాబాద్ వైపుకి దూసుకుపోయాడు.

- - - - -

'ఏం బాబూ! ఏం చదువుతున్నావు?'

'టెంత్ క్లాసంకుల్!'

'నీకెవరంటే ఇష్టం?'

'ముషారఫ్ అంకుల్!'

భరత్ జుత్తు పీక్కుంటూ 'నీక్కూడా ముషారఫ్...' పూర్తిగా చెప్పేలోగానే ఆ కుర్రాడు-

'అవునంకుల్! ముషారఫ్ అంకుల్ భలేగా యుద్ధం చేశాడు. విలన్ లాడెన్ అంకుల్‌కి భలే బుద్ధి చెప్పాడు. బుష్ అంకుల్ కూడా ముషారఫ్ అంకుల్‌ని...'

మరో క్షణం అక్కడుంటే తల పెంకులు లేచి ఊడొస్తాయనిపించి అదృశ్యమైపోయాడు.

✦✧✦

జాబ్ కోసం ఇంటర్వ్యూకెళ్తే- తనే చివరి అభ్యర్థి. ఆఖర్లో వాళ్లు పిలిచి 'నోబెల్ శాంతి బహుమతికి నువ్వయితే ఎవ్వర్ని ఎన్నిక చేస్తావ్?' ప్రశ్నించారు. ఎవరి పేరు చెబుదామా అని ఆలోచిస్తుంటే- వాళ్లు అసహనంగా వాచీల వంక చూశారు.

అతని బుర్రలో బోలెడన్ని దినపత్రికల హెడ్డింగులు! బోలెడన్ని టీవీ ఛానెళ్ల వార్తలు! అన్నీ ఒక్కసారిగా మెదడులోకి దూసుకొచ్చి, ఒకే ఒక మొహం... ఒకే ఒక వార్త ఫ్లాష్ అయి అప్రయత్నంగా 'ముషారఫ్' గట్టిగా అరిచాడు. క్షణంలో వెయ్యో వంతు లోపే తను చెప్పిన పేరుకి తనకే ఆశ్చర్యం కలిగి దిగ్భ్రాంతి చెందాడు. ఆ దిగ్భ్రాంతిలోంచి తేరుకుని చూస్తే-

ఇంటర్వ్యూ కమిటీ మెంబర్లు నలుగురూ ధామ్మని కిందపడి పక్షవాతం వచ్చిన వాళ్లలా కాళ్లూ చేతులూ కొట్టుకుంటున్నారు!!

❀